క్లుప్తంగా

రేపటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'



భవనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పూల నరసింహులు

తనకల్లు: మండలంలో ఈనెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల గదులను గురువారం ఆరోగ్య సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఈఓ మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి అక్టోబర్ 17 వరకూ 14 గ్రామ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 30న తనకల్లు-1, అక్టోబర్ 3న చీకటిమానిపల్లి, 4వ తేదీన ఈతోడు, 5వ తేదీన గేమేనాయక్ తండా, 6న కోటపల్లి, 7న మల్లిరెడ్డిపల్లి, 9వ తేదీన టీ.సదుం, 10న తనకల్లు-2, 11వ తేదీన తనకల్లు-3, 12న తవళం, 13వ తేదీన బాలసముద్రం, 16న కొర్తికోట, 17వ తేదీన బొంతలపల్లి గ్రామ సచివాలయాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హజరత్ నబీరసూలుల్లా ఉరుసు



అలంకరణలో హజరత్ నబీరసూలుల్లా దర్గా

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డు బీడుపల్లి గ్రామంలో మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని రెండ్రోజుల పాటు నిర్వహించిన హజరత్ నబీరసూలుల్లా ఉరుసు గురువారం ముగిసింది. ఉరుసు సందర్భంగా నబీ స్వామి దర్గాను రంగురంగులు పూలు, విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించారు. దీపారాధన సందర్భంగా హిందూ ముస్లింలు ఐక్యతగా స్వామిని దర్శించుకుని చక్కెర చదివింపులు చేయించారు. రాత్రి ఖురాన్ పఠనం చేసి, సారాంశం వినిపించారు. ఉరుసుకు ఇతర రాష్ట్రాల నుంచి ముస్లింలు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గ్రామంలో దర్గా చుట్టూ రకరకాల దుకాణాలు వెలిశాయి.

జానపద కళలను పరిరక్షించడమే లక్ష్యం



జానపద కళాకారులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బత్తలపల్లి: అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించడమే లక్ష్యంగా తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ పని చేస్తోందని సభ్యుడు అంజనప్ప తెలిపారు. గురువారం హార్మోనిస్టు ఆవేటి రామంజినేయులు, శిష్య బృందం యోగానందచారి, ఆదినారాయణ, ముసలప్ప, ఆనంద్, శివయ్య, సాయినాథ్ తదితర కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ జానపద కళలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జానపద కళాకారులను కళాభిషేకం కార్యక్రమం ద్వారా వారి సేవలను గుర్తించి సన్మానించడం జరుగుతోందన్నారు.

ప్రశాంతంగా జీవించాలి



మాట్లాడుతున్న సీఐ రామయ్య

కొత్తచెరువు: కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవితం గడపాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాగిరి రామయ్య సూచించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలు పెద్దవిగా మారి ఘర్షణలకు దారి తీస్తాయన్నారు. ఇరుపక్షాలు సామరస్య పూర్వకంగా కూర్చొని మాట్లాడుకోవడం వల్ల సమస్యలను సున్నితంగా పరిష్కరించుకోవచ్చన్నారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు పోలీసులు పని చేయాలన్నారు. సర్కిల్ కార్యాలయంలో పుట్టపర్తి రూరల్, కొత్తచెరువు, బుక్కపట్నం, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. చిన్నచిన్న గొడవలపై గ్రామాలకు వెళ్లి సమస్యలను తెలుసుకోవాలన్నారు. సమస్యకు దారితీసిన పరిణామాలు, గ్రామంలో విచారించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం కలుగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



ధర్మవరం: ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పట్టణంలోని పురవీధుల్లో గురువారం ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ముస్లింలు పవిత్రంగా ప్రార్థించే మసీదు నమూనాను ప్రత్యేక వాహనంలో అలంకరించి ఊరేగించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ముస్లిం సోదరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. దర్గాలో ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ముస్లింలు జెండాలు చేతపట్టుకుని పట్టణంలోని దర్గావీధి నుంచి తేరుబజార్, అంజుమన్ సర్కిల్, గాంధీనగర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, కాలేజి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం ముస్లింలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు చాంద్ బాషా, సుబహాన్, ఎస్పీ బాషా, కరీం, కృష్ణాపురం జమీర్, అత్తార్ జిలాన్‌బాషా, జాకీర్, ఇనయతుల్లా, సరితాలబాష, తొండమాల రవి, లాలాల్‌బాబు, ముక్తియార్, వెల్డింగ్ షెక్షా, నజీర్, మసూద్, సాదిక్ వలి, గార్మెంట్ వలి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: ప్రేమాభిమానాల వనంలో వికసించినదే ఇస్లాం అని పలువురు వక్తలు అన్నారు. గురువారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మండలంలోని పలువురు ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని గుర్తు పెట్టుకుని, ఇస్లాం నియమాలను పాటించాలని తెలిపారు. అనంతరం మసీదుల్లో కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు.

తనకల్లు: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు గురువారం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. విశ్వంలో మానవులు ఒకరి పట్ల మరొకరు ప్రేమ, ఆప్యాయత, మత సామరస్యం, సహనం, కరుణ. జాలి, ఐక్యత, సోదరభావంతో మెలగాలని ప్రవక్త ప్రధాన భోధనలని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. చెడును విడనాడి సన్మార్గంలో ప్రయాణించాలన్నారు. అనంతరం పట్టణ పుర వీధులలో గుండా ర్యాలీ చేపట్టారు.

శాంతి ర్యాలీ

కదిరి అర్బన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ముస్లిం సోదరులు పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అమీనియా మసీదు నుంచి ప్రారంభమై నానా దర్గా, ఇక్బాల్ రోడ్డు, మెయిన్ రోడ్డు, బైపాస్ మీదుగా తిరిగి అమినీయా మసీదుకు చేరుకుంది. మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో అందరూ నడవాలని పలువురు ముస్లింలు పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు సంఘీభావంగా కులమతాలకు అతీతంగా ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అమీనియా మసీదు వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు, మగ్బుల్ అహమద్, సాదత్ అలీఖాన్, టీఎం మైనుద్దీన్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు జిలాన్, నాయకులు డా.బత్తల వెంకటరమణ, కేఎస్ బాహాద్దీన్ పాల్గొన్నారు.

తాడిమర్రి: తాడిమర్రి, ఎం.అగ్రహారం, పిన్నదరి, నార్సింపల్లి, శివంపల్లి, చిల్లకొండయ్యపల్లి, నాయనపల్లి గ్రామాల్లో గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం రాత్రంతా జాగారం చేశారు. అల్లా ప్రవక్త జన్మదినం, ప్రేమ, దయ, జాలి తదితర వాటిని మసీదు ఇమామ్ ఖాజా వివరించారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, ఇస్మాయిల్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



తనకల్లు: ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



కదిరి: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



తాడిమర్రిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సబ్సిడీపై స్ప్రింక్లర్ల పంపిణీ



సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులను అందజేస్తున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి పంచాయతీలో అర్హులైన రైతులకు సబ్సిడీపై మంజూరు చేసిన స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులను గురువారం ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎల్లవేళలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న నాలుగు రోజుల్లోపే డ్రిప్ పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో రైతులు జగన్మోహన్ రెడ్డి, విష్ణు, రంగారెడ్డి, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన కుంటిమద్ది పాఠశాల విద్యార్థులు

రామగిరి: మండలంలోని కుంటిమద్దికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే హాకీ, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల సిబ్బంది గురువారం తెలిపారు. కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మీనాక్షి, శివప్రసాద్, సాత్విక్, ప్రేమసాయి, శృతి, సౌమ్య పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జెడ్పీటీసీ గోసే నాగార్జున, సర్పంచ్ నరేంద్ర, పాఠశాల సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని బాస్కెట్ బాల్ కోర్టులో గురువారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీన అనంతపురం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో ధర్మవరం క్రీడాకారులు వీరసంజయ్ కుమార్‌రెడ్డి, కిరణ్మయి, సల్మా ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు పట్టణంలో జరిగే 9వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు తరఫున క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న నల్లమాడ మండల కన్వీనర్ సూర్యనారాయణ

నల్లమాడ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు సీఎం వైఎస్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నల్లమాడ మండల కన్వీనర్‌గా నూతనంగా నియమితులైన కాళసముద్రం సూర్యనారాయణ గురువారం మండల పార్టీ నాయకులతో కలిసి పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిశారు. దుశ్శాలువా, పూలమాలలతో ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. అందరినీ కలుపుకుని గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం మండల కన్వీనర్ సూర్యనారాయణను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సూర్యనారాయణ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీఆర్ కేశప్ప, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, సీనియర్ నాయకులు పీవీ భాస్కర్‌రెడ్డి, అశ్వర్థనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యుడు కే.రవిచంద్రారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, సర్పంచులు ప్రసాద్, బొజ్జేనాయక్, మైనార్టీ నాయకులు బాబావలీ, షరీఫ్, హబీబుల్లా పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా



జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఎంజేపీ పాఠశాల బాలికలు



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన హరినాథరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: ఇటీవల కొత్తచెరువులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో బుక్కపట్నం మహాత్మా జ్యోతిబా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ బషీరున్నీసా గురువారం తెలిపారు. అండర్-17, అండర్-14 విభాగాల్లో షటిల్, ఖోఖో, కబడ్డీ, పరుగు పందెం, యోగా పోటీల్లో 18 మంది బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. సత్తా చాటిన బాలికలను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ఇటీవల అనంతపురం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ పోటీల్లో బుక్కపట్నం బాలుర ఉన్న పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి హరినాథరెడ్డి సత్తా చాటాడు. అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు గురువారం తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం-6, 7లో ఏఎన్ఎంలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలు అందించే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కవిత, నాయకులు బ్రిక్స్‌సాయి, బీఎల్ఓ బాలకృష్ణ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- ఎల్లోమీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- వైఎస్సార్‌సీపీ హయాంలోనే శ్రీ సత్యసాయి జిల్లా సాధన
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



కోవెలగుట్టపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: ప్రజలతో మమేకమవుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి, కొవెలగుట్టపల్లి, కమ్మవారి పల్లి, ప్రశాంతి గ్రాంలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి అక్కచెల్లెమ్మలు, రైతులకు అండగా నిలిచారన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లాను తీసుకురావడం జరిగిందన్నారు. బెంగళూరు, చెన్నైలతో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాలను కలిపేలా 342 జాతీయ రహదారిని తీసుకువచ్చి ఈప్రాంత అభివృద్ధికి బాటలు వేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో గూడులేని పేదలు ఉండరాదన్న లక్ష్యంతో 25 వేల ఇళ్లను మంజూరు చేయించి నిర్మించడం జరుగుతోందన్నారు. రూ.864 కోట్లతో 193 చెరువులను నీటితో నింపే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని వెల్లడించారు. ప్రభుత్వం పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేసిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికి పింఛన్లు, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, ఇళ్ల మంజూరు చేయడం జరిగిందన్నారు.

50 వేల మెజార్టీ లక్ష్యం..

ప్రతి వార్డులో నెలకు నాలుగు సార్లు వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న లబ్ధిని వివరించాలన్నారు. గతంలో పుట్టపర్తి నియోజకవర్గంలో 33 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందడం జరిగిందన్నారు. 2024లో 50 వేల ఓట్లతో రెండోసారి పుట్టపర్తిపై వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలపై ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామంటూ కార్యకర్తలు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పార్టీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్, కౌన్సిలర్లు సాయిగీత, లక్ష్మీదేవి, చెరువుభాస్కర్‌రెడ్డి, అనితాశంకర్, పవన్ కుమార్, కో-ఆప్షన్ మెంబర్ రఫీ, నాయకులు మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చెన్నకృష్ణ, శంకర్, రఘునాథరెడ్డి, ధనుంజయ రెడ్డి, కానజనార్దన్, మాదినేని చెన్నకృష్ణ, సందీప్ నాయుడు, సతీష్, చౌదరి, కిష్టప్ప, చలపతి, కవిత, నాగిరెడ్డి, రామణారెడ్డి, రుషీకేశవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయక్, రవినాయక్, నారాయణ, స్వామినాయక్ పాల్గొన్నారు.

సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న పట్టణ ప్రముఖులు

ధర్మవరం: సెంట్రల్ సిల్క్ బోర్డు అవార్డు అందుకున్న పట్టణానికి చెందిన చేనేత వ్యాపారి జింకా రామంజినేయులును గురువారం ఆయన నివాసంలో పట్టణ ప్రముఖులు ఘనంగా సన్మానించారు. మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు జయశ్రీ, గడ్డం పార్థసారధి, జక్కా చిన్న శింగరయ్య పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన ఇందూ(20) అనే వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఆమె గత బుధవారం కుమార్తెతో కలిసి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన తల్లి దమయంతి తమకు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం



రాధమ్మ | పూజారి లక్ష్మీ నరసింహులు | జూటూరు శేఖర్ | గంగిరెడ్డి గారి నర్సిరెడ్డి | మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి | క్రా హనుమంతరెడ్డి

- ఇద్దరు పాతవారు, నాలుగు మండలాలకు కొత్తవారు

రాప్తాడురూరల్: రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లను నియమించింది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వెల్లడించారు. రాప్తాడు, కనగానపల్లి మండలాల్లో పాతవారికే అవకాశం కల్పించగా, నాలుగు మండలాలకు కొత్తవారిని నియమించారు. అనంతపురం రూరల్ మండల కన్వీనర్‌గా కక్కలపల్లికాలనీ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కె.రాధమ్మ, ఆత్మకూరు మండల కన్వీనర్‌గా పూజారి లక్ష్మీనరసింహులు, రాప్తాడు మండల కన్వీనర్‌గా జూటూరు శేఖర్, చెన్నేకొత్తపల్లి మండల కన్వీనర్‌గా గంగిరెడ్డి గారి నర్సిరెడ్డి, కనగానపల్లి మండల కన్వీనర్‌గా మామిళ్లపల్లి అమర్నాథ్ రెడ్డి, రామగిరి మండల కన్వీనర్‌గా క్రా హనుమంతరెడ్డిని నియమించారు.

పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ..

కొత్తగా నియామకమైన మండల కన్వీనర్లను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అభినందించారు. ఆయా మండలాల్లోని గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలను కలుపుకొనిపోతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. చురుగ్గా పనిచేయాలన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు.

హనుమాన్ విగ్రహ నిర్మాణానికి చర్యలు

హిందూపురం: పట్టణంలోని సూగురు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతిష్ట చేయనున్న అభయాంజనేయస్వామి విగ్రహాన్ని మలిచేందుకు చర్యలు చేపట్టారు. ఈమేరకు గురువారం సూగురు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఏక శిలను కర్ణాటకలోని సాగర్ ప్రాంతానికి చెందిన నేషనల్ అవార్డు పొందిన గౌతం గుడిగార్ నిర్మాణ సంస్థకు అప్పగించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత వైసి చంద్రశేఖర్ రూ.5 లక్షలను నిర్మాణ సంస్థకు అడ్వాన్సుగా అందించారు. నాయకులు చారుకీర్తి, రాయల్‌గోపాల్ తదితరులుపాల్గొన్నారు. ఈ బృహత్ దైవకార్యానికి దాతలు సహకరించాలని కోరారు. కాగా అయోధ్య, మంత్రాలయంలో 108 అడుగుల రాముడి విగ్రహాలను నిర్మిస్తున్నది పై నిర్మాణ సంస్థనే .

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ పెద్ద కూతురు భార్గవి(8) అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. కొంత కాలంగా మెదుడులోని నరాల్లో రక్తం గడ్డకట్టడంతో కొంతకాలంగా కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వివరించారు. బాలిక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదుతున్నట్లు తెలిపారు.